క్లుప్తంగా

నేడు పంచాంగ శ్రవణం

తాళ్లగడ్డ : ఉగాది సందర్భంగా నేడు పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం ఉంటుందని ప్రధాన అర్చకుడు వేణుగోపాలాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి శనివారం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 210 మంది లబ్ధిదారులు, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన

సూర్యాపేట : రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాలో జరిగే ఏర్పాట్లను సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, మాజీ కౌన్సిలర్ జహీర్, మార్కెట్ డైరెక్టర్ ధరావత్ వెంకన్ననాయక్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, తంగెళ్ల కర్ణాకర్‌రెడ్డి, నాగుల వాసు, బొజ్జ సంజయ్, చెంచల నిఖిల్ నాయుడు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో 100 ముస్లిం కుటుంబాలకు 45వ వార్డు మాజీ కౌన్సిలర్ గండూరి పావనికృపాకర్ శనివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి వెంకటేశ్వర్లు, మిరియాల కృష్ణమూర్తి, మీల వంశీ, మరియాల శివకుమార్, బెజ్జగం పని, మిట్టపల్లి రమేష్, నల్లపాటి రమేష్, మంచాల శ్రీనివాస్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

నీళ్లిస్తేనే పంటలు చేతికి!

- తుంగతుర్తి నియోజకవర్గంలో 1.10లక్షల ఎకరాల్లో వరిసాగు
- నీటిని ఇవ్వకపోతే 50 శాతానికి పైగానే ఎండిపోనున్న పంటలు



అర్వపల్లి శివారులో సాగులో ఉన్న వరి పొలాలు

అర్వపల్లి : యాసంగి వరిపంటలు మరో 15రోజుల్లో చేతికందనున్నాయి. అయితే ప్రస్తుతం ఈ పంటలకు మరోతడి నీళ్లు అవసరం. కానీ ఇప్పటికే గోదావరి జలాల షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం చేతికందే దశలో నీళ్లు నిలిచిపోవడంతో వరిపంటలు ఎండిపోతున్నాయి. కాగా గతంలోనే చివరి భూములకు నీళ్లు అందకపోవడం, ఉష్ణోగ్రతలు ఎన్నడూ లేని విధంగా పెరగడంతో వరిపంటలు కొంత వరకు ఎండిపోయాయి. మిగిలిన పంటలను కాపాడుకోవడానికి అన్నదాతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లోనే గోదావరి జలాలు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మరో విడత నీటి కోసం ప్రతిపాదనలు..

వరి పంటలు చేతికందే దగ్గర్లో ఉండటం, గోదావరి జలాలు నిలిచిపోవడంతో ఆ పంటలను ఎలాగైనా కాపాడాలని రైతులు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. దీంతో నీటి పారుదలశాఖ అధికారులు పరిస్థితిని గమనించి మరో వారం రోజులపాటు నీటిని విడుదల చేయాలని కోరుతూ ఆశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. తుంగతుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో అత్యధికంగా ఎస్సారెస్పీ రెండోదశ కింద ఈ సారి 1.10 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో కొంత పంట నీళ్లు అందక ఎండిపోగా మిగిలిన పంటను కాపాడుకోవడానికై అన్నదాతలు నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటిని మరోవారం పాటు పునరుద్ధరిస్తేనే వరిపంటలు బయటపడనున్నాయి.

పంటలను కాపాడాలి

మరోవారం పాటు నీటిని వదిలి ఎండిపోతున్న పంటలను కాపాడాలి. ఇప్పటికే నీళ్లు చాలక కొంత వరిపంట ఎండిపోయింది. ఉన్న పంటకు నీళ్లు వదిలి ఆదుకోవాలి. లేకపోతే వరిపంట పూర్తిగా ఎండిపోనుంది.

– సంజీవ్‌నాయక్, రైతు, సూర్యనాయక్‌తండా

ప్రతిపాదనలు పంపాం



రైతులకు యాసంగిలో ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నీటిని ఇవ్వడం జరిగింది. ఈసారి అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో నీళ్లు అడుగంటాయి. మరో విడత నీటి విడుదల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం.

– ఎం.సత్యనారాయణ, డీఈఈ, బయ్యన్నవాగు

సంస్కృతిని తెలిపేవే పండుగలు



ఉగాది పచ్చడి సేవిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : మన సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేవే పండుగలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతినరేష్ ఇంట్లో ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పచ్చడి సేవించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

మండల కేంద్రంలోని పాత గ్రామంలో శనివా రం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, మైనార్టీ సెల్ నాయకులు ఎండీ.హాఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా మల్లేష్‌యాదవ్

తాళ్లగడ్డ (సూర్యాపేట): బహుజన సమాజ్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా బుడిగ మల్లేష్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దయాకరన్ మౌర్య అధ్యక్షతన శనివారం సూర్యాపేట పట్టణంలో సమావేశం నిర్వహించి జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పరశురాం, జిల్లా ఇన్‌చార్జిగా ఎర్ర రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కొండమీది నరసింహారావులు ఎన్నికయ్యారు.

సన్నబియ్యం పరిశీలన

అర్వపల్లి: కాసర్లపహాడ్, కోమటిపల్లి, పర్సాయపల్లి గ్రామాల్లో రేషన్ దుకాణాలకు చేరిన సన్నబియ్యాన్ని శనివారం గిర్దావర్ రామరాజు జలేందర్‌రావు పరిశీలించారు. మండలంలోని అన్ని దుకాణాలకు సన్న బియ్యం చేరాయని చెప్పారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు దండ అరుణ, తిరుపతయ్య, బాసాని అశోక్ పాల్గొన్నారు.

ఉగాది కవితలు



చైత్ర మాసపు అందాల సుమబాల ఉగాది
ప్రతి ఇంటా విరిసే ఆనందాల పెన్నిధి
కొత్త చిగుర్లు తొడిగిన తరువులు
పచ్చదనం శోభతో మోసుకొస్తున్నాయి
శుభసందేశాలు.. పండితుల పంచాంగ శ్రవణాలు
ప్రతి ఇంటి ముంగిట మెరిసే రంగవల్లులు
షడ్రుచోపేత ఉగాది పచ్చడి.. మోగించాలి మన ఇంట
సంబరాల సందడి.. విశ్వావసునామ సంవత్సరాన్ని
ఆహ్వానిద్దాం ఆనందంగా..

– అబ్బగాని పవన్ కుమార్, తెలుగు ఉపాధ్యాయుడు
శ్రీ స్వామినారాయణ్ గురుకుల్ అంతర్జాతీయ పాఠశాల, సూర్యాపేట



ఉగాది ఆగమనం తెలుగోళ్లకు సంతోషం
తెలుగువారి తొలిపండుగ తెలుగుజాతి పెద్దవేడుక
చైత్రమాసం ఆరంభం వసంతకాలం ప్రారంభం
ఋతువు మార్పు కొత్తసంవత్సరం మొదలు
మల్లెల గుబాళింపులు, కోకిలల కుహూకుహూలు
పంచాంగ శ్రవణాలు, షడ్రుచుల ఆరగింపులు
కవితల సమ్మేళనాలు, కవులకు సన్మానాలు
శుభాకాంక్షలు చెప్పటాలు, కలసి యుగాదిసంబరాలు
కొత్తబట్టల ధరించటం.. గడపలకు తోరణాలుకట్టటం
కొత్తకోడళ్లు కోడరికానికిరావటం సలిజండిపందేరాలు..
ఉగాది సంప్రదాయం.. గుళ్లల్లో పూజలు.. దేవుళ్ల ఊరేగింపులు
భాజాభజంత్రీలు భజనలు.. కోలాటకోలాహలాలు..
మధుమాసమాధుర్యాలు.. విశ్వావసు ఉగాదికి ఆహ్వానం పలుకుదాం..
నూతన సంవత్సరాన్ని ఆనందంగా గడుపుకుందాం..

– రాచకొండ ప్రభాకర్, సూర్యాపేట



ఉగాది ఆత్మీయత పునాది తెలుగువారి ఆది పండగ
నవ వసంత ప్రకృతి శోభకు ఆనందాల స్వాగతం
కోటి ఆశలతో కొంగొత్త రెక్కలతో
షడ్రుచుల సేవనం జీవితానుభవాల ప్రయాణం
కాంక్రీట్ యుగంలో అద్దాల గదుల్లో
ఎండమావులైన ఆత్మీయ అనుబంధాల పలకరింపులు
కమ్మని కోయిల స్వర పలకరింపుతో వెల్లి విరియాలని
అచ్చ తెలుగు సంస్కృతి సాంప్రదాయ పర్వాన్ని
తెలుగుతనం ఉట్టిపడేలా ఒక్కటై సంబరంగా చేసుకుందాం.

– జి.వెంకటరమణ, తిరుమలగిరి



ఉగాది నూతన సంవత్సరాన వెల్లివిరియాలి
అందరి జీవితాల్లో ఆనందాల హరివిల్లు
ప్రతి మదిలో పరిమళించాలి ఉజ్వల భవిష్యత్తులకు
పూలదారులు.. పల్లెపల్లెనా వెల్లివిరియాలి
పసిడి పంటల పరవశానందం.. మసకబారిన బతుకుల్లో
ఆశల జ్యోతులు వెలిగించాలి.. ఉగాది ఉషస్సు పెంచాలి
సకల జగత్తుకి శ్రేయస్సు.. ఎన్నో ఆశల హరివిల్లులు తోడుగా
మరెన్నో ఆశయాల పల్లకి తేవాలి ఉగాది.. ఎందరో తల్లుల
కన్నుల కొలుకుల్లో.. ఆనందపు భాష్పాలు నింపాలి ఉగాది

– జిల్లేపల్లి జానయ్య, పాట్లపహాడ్, తిరుమలగిరి



కొసరి కొసరి ఆహ్వానిద్దాం.. కొంగొత్త
శ్రీవిశ్వావసు ఉగాదిని.. కమనీయంగా
గమనిద్దాం.. కాంతిరేఖల్ని ద్వాదశ
రూపాలతో.. సంస్కృతులు, సంప్రదాయాలూ
సహజీవనకై కావాలి సాధనలు..

– సుతారపు వెంకటనారాయణ, జాజిరెడ్డిగూడెం



ఉగాది.. ఓ ఉగాదీ, యుగానికే నీవొక ఆదీ.!
నీ పేరే ఒక యేడాది ! షడ్రుచుల బ్రతుకు
నిచ్చుగదా నీ మదీ! యాడాదికొకమారు పేరు
మార్చుకుంటూ.. శ్వాస విశ్వాసాల ఓ
విశ్వావసు సుగంధమా ! కోయిల పాటలతో మమ్ము
అలరారిస్తూ.. గడిచిన కాలాన్ని కౌగిల్లనుంచి తొలగిస్తూ..
మళ్లీ వచ్చావా ఓ ఉగాది ? నీవే మా బ్రతుకు ఆశల మదీ ?

– డాక్టర్ బెల్లంకొండ శ్రీరామ్, గాజులమల్కాపురం, పెన్‌పహాడ్



తెలుగు వారి కొత్త యాడాది ఉగాది
జీవితంలోకి వచ్చింది కొత్త మార్పుతో యుగాది
సీస పద్యాల మాధుర్యం ఉగాది పచ్చడి
ఆరు దశబ్దాల జీవన గమనమే యుగాది
ప్రకృతిలో వచ్చే ప్రతిమార్పు ఉగాదియే!
విశ్వావసు నింపుతుంది మీలో నవ వసంతం

– తాడూరి వెంకన్న (తావి), జాజిరెడ్డిగూడెం

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు



తొండలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



జాజిరెడ్డిగూడెంలోని పాఠశాలలో..

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం తొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేముల వెంకటేశ్వర్లు, గుగులోతు వీరన్న, ధరావత్ వెంకటి, బొజ్జ నాగయ్య, బెదరకోట రాజు, రఘుపతి, సైదులు పాల్గొన్నారు.

నాగారం : వర్ధమానుకోట ఆవాసం పాటిమీదిగూడెం ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆనంద మాట్లాడుతూ ఉగాది పచ్చడిలోని షడ్రుచులు మనలోని భావోద్వేగాలకు ప్రతీకలని అన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని విద్యార్థులందరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, రజిత పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తుగా ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడి, సేమియాకీర్, మిఠాయిలు తయారుచేశారు. అలాగే రంజాన్‌ను పురస్కరించుకొని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్. వెంకటేశ్వర్లు, సీహెచ్. నాగరాజు, వి. యాదగిరి, జి. మంజుల, ఆర్. నాగరాజు, బి. రమేష్, జి. శంకర్, కె. రమేష్, విద్యార్థులు సాత్విక్, ఆసీఫా, ఫౌజియా పాల్గొన్నారు.

38 ఏళ్లుగా పంచాంగ పఠనం

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లో గల వేదాంత భజన మందిరంలో సూర్యాపేట పట్టణానికి చెందిన ప్రముఖ పురోహితుడు మంత్రమూర్తి శంకరమూర్తి 1987 నుంచి గత 38ఏళ్లుగా ఉగాదికి పంచాంగం పఠిస్తున్నారు. తెలుగు సంవత్సరాది రోజున సంప్రదాయ దుస్తులు ధరించి, పుణ్యక్షేత్రంలో పంచాంగం పఠించడంతో పాటు ప్రజలు ఏ విధంగా ఉంటారు, ఆదాయం, వ్యయం వంటి వివరాలను క్షుణ్ణంగా వివరిస్తారు.

పంచాంగం విన్నా.. చదివినా పుణ్యం

ఉగాది రోజు పంచాంగం విన్నా.. చదివినా ఎంతో పుణ్యం వస్తుంది. పంచాంగానికి ఎంతో విశిష్టత ఉంది. ఈ ఏడాది శ్రీవిశ్వావసు నామ సంవత్సరం వర్షాలు పుష్కలంగా పడతాయి. ఈ సంవత్సరంలో రైతులు పంటలతో పాటు వ్యాపారం చేసుకుంటే ఎంతో లాభదాయకంగా ఉంటుంది.

– మంత్రమూర్తి శంకరమూర్తి, వైదిక పురోహితుడు, వైదిక బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు

పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటాలు



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

సూర్యాపేట అర్బన్ : పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు అధ్యక్షతన కేవీపీఎస్ జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుల వివక్ష నిర్మూలనకు చట్టాలు సక్రమంగా అమలుకావడం లేదన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

బీసీ పోరుగర్జన సభను జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాళ్లగడ్డ : బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ ఆధ్వర్యంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ పోరు గర్జన సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చలమల్ల నర్సింహ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నిద్ర సంపత్ నాయుడు, బీసీ జిల్లా నాయకులు దాసరి వెంకన్న యాదవ్, యలగందుల సుదర్శన్, బండపల్లి శ్రీనివాస్‌గౌడ్, కోడి లింగయ్య యాదవ్, బత్తుల దశరథ, పున్న వెంకన్న, దోరేపల్లి రవి, యలగందుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీలో జరిగే బీసీల పోరు గర్జన సభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు కోరారు. శనివారం తిరుమలగిరిలో పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొత్తగట్టు మల్లయ్య, బ్రహ్మం, యాదగిరి, సోమయ్య, భిక్షం, శ్యామ్, మహేష్, కిరణ్, ఉపేందర్ పాల్గొన్నారు.

బెల్లంకొండ శ్రీరామ్‌కు బంగారు నంది అవార్డు



అవార్డు అందజేస్తున్న సినీ హాస్యనటుడు బాబుమోహన్, సంస్థ నిర్వాహకులు

పెన్‌పహాడ్ : గాజులమల్కాపురం గ్రామానికి చెందిన ఉత్తమ నవల రచయిత డాక్టర్ బెల్లంకొండ శ్రీరామ్ హైదరాబాద్‌లోని బిర్లాసైన్స్ ఆడిటోరియంలో శుక్రవారం బంగారు నంది అవార్డు అందుకున్నారు. శనివారం ఈ సందర్భంగా మాట్లాడారు. మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఉగాది పురస్కారాలు 2025లో భాగంగా కౌగిలి అనే నవల ద్వారా అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. మాజీ మంత్రి బాబుమోహన్, సినీ యాక్టర్స్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలియజేశారు.

అమరుల ఆశయసాధనకు ఉద్యమించాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్): బానిస సంకెళ్ల విముక్తి కోసం పోరాడిన అమరవీరుల ఆశయసాధనకు యువత ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి మండల కేంద్రంతోపాటు ఏపూరు, తుమ్మలపెన్‌పహాడ్, రామన్నగూడెం గ్రామాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు జిలేర్, రవి, గోపాల్, బత్తిని ఎల్లయ్య, అలుగుబెల్లి వెంకటరెడ్డి, దేగల వెంకటక్రిష్ణ, ఎర్రయ్య, లింగయ్య, వెంకటరెడ్డి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్

పెన్‌పహాడ్ : లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు డీఈ ఆపరేషన్ ఎ. శ్రీనివాస్ అన్నారు. భక్తాళాపురం గ్రామంలోని సబ్ స్టేషన్‌లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి శనివారం రూ.కోటి 30లక్షల వ్యయంతో 8ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి మాట్లాడారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఈదులవాగు తండా, భక్తాళాపురం, ధర్మాపురం, మహ్మదాపురం, రంగయ్యగూడెం, భాగ్య తండా, మేగ్యా, రత్యా తండాల్లో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ జ్యోతికుమార్, ఏడీఈ ఇంద్రా, ఏడీఈ ఆపరేషన్ రాములు నాయక్, ఏఈలు మహేష్, గౌతమ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు

పెన్‌పహాడ్ : పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ లాలు అన్నారు. శనివారం నారాయణగూడెంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రంజిత్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులు ప్రారంభం



ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

పెన్‌పహాడ్ : ముందుకు సాగని ఇళ్ల పనులు అనే శీర్షికతో ఈ నెల 20న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా ఇంటి పనులను ప్రారంభించారు.

గడువు పొడిగించాలి

పెన్‌పహాడ్ : రాజీవ్ యువ వికాసం పథకం గడువు పొడిగించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో ఆలస్యం అవుతోందని తెలిపారు. అందువల్ల పథకం గడువు పొడగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

సూర్యాపేట అర్బన్ : హెచ్‌పీసీఎల్ ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేకల శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో హెచ్‌పీసీఎల్ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు ధూళిపాల ధనంజయ నాయుడు, రేమిడాల రాజు, ఏఐటీయూసీ అధ్యక్షులు జడ శ్రీని వాస్, దంతాల రాంబాబు, రాజారామ్, చామల అశోక్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పాలకవర్గం కృషి



మాట్లాడుతున్న గుడిపాటి సైదులు

తుంగతుర్తి : రైతుల సంక్షేమానికి పాలకవర్గం కృషి చేస్తోందని సింగిల్ విండో చైర్మన్,డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన మహా జన సభ సమావేశంలో పాల్గొని మా ట్లాడారు. పాలకవర్గం, రైతుల సహకా రంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు మోడెం శ్రీలత, కేతిరెడ్డి రవీందర్‌రెడ్డి, ఎండీ.మజీద్, పెండెం యాదగిరి, భిక్షంరెడ్డి, రామచంద్రు, ఈదప్ప, ఎడ్ల ఎల్లయ్య, రేగటి పూలమ్మ, రామనర్సమ్మ, సొసైటీ కార్యదర్శి వందనపు వెంకటేశ్వర్లు, సొసైటీ సిబ్బంది యాదగిరి, మహేష్, ఉమేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

నాగారం : మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ అ న్నారు. శనివారం పసునూర్‌లోని మసీదులో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందులు హిందూ–ముస్లింల మధ్య సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తలూరి వెంకటయ్య, కమటం శ్రీను, మల్లేపాక రవీందర్, మామిడి సోమయ్య, పొదిల వెంకన్న, రవి, నరేష్, గణేష్, ప్రణయ్, అభిరాం, ముస్లింలు ఎస్‌కె.జానీ, హోలిమియా, గౌస్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోంది

తుంగతుర్తి : రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, ఉగాది పండుగ రోజున నిర్వహించ తలపెట్టిన సన్న బియ్యం పంపిణీ పథకం దేశ చరిత్రలోనే చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తప్పట్ల శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి శ్రీను, కలకొట్ల మల్లేష్, మాచర్ల అనిల్ పాల్గొన్నారు.

బోయలపల్లి రేఖకు సన్మానం

అర్వపల్లి : రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన మండలంలోని అడివెంల గ్రామానికి చెందిన రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖను శనివారం గ్రామంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుంభం సతీష్, నాయకులు ఈద కోటిప్రసాద్, మల్లెబోయిన సాయి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

తిరుమలగిరి: బీహార్‌లో జరుగుతున్న జా తీయ స్థాయి యూనియన్ హ్యాండ్ బాల్ పోటీలకు గుండెపురికి చెందిన ప్రసాద్ ఎంపికయ్యారు. కరీంనగర్‌లో జరిగిన హ్యాండ్ బాల్ ఛాంపియన్ షిప్‌లో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆ జట్టు క్రీడాకారుడైన ప్రసాద్‌ను గ్రామస్తులు అభినందించారు.

మహిళ ఆత్మహత్య

తిరుమలగిరి: ఇంటి పక్కన వారు తిట్టారని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శనివారం తొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలి పిన ప్రకారం .. తొండ గ్రామానికి చెందిన వే ల్పుగొండ మంజుల (42)కు అదే గ్రామంలోని ఇంటిపక్కన వారితో గొడవ జరిగింది. అయితే మంజులను వారు తిట్టడంతో మనస్తాపం చెంది ఇంట్లో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి పెట్టుకుంది. ఇంతలో కుటుంబ సభ్యులు చూసి ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హరితహారం మొక్కలు దగ్ధం

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలోని 365 జాతీయ రహదారి వెంట హరితహా రం మొక్కలు శనివారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. సమీపంలోని చెత్తను కాలుస్తున్న క్రమంలోనే మొక్కలకు మంటలు అంటుకున్నట్లు తెలుస్తోంది.

ఇసుక రీచ్ సందర్శన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం శివారు తుంగగూడెం మూసీనదిలో ఏర్పాటు చేసిన సాండ్ ట్యాక్స్ పథకం ఇసుక రీచ్‌ను శనివారం తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు సందర్శించారు. ఈ రీచ్ నుంచి 7 మండలాలకు ఇసుక సరఫరా జరుగుతుందని చెప్పారు. ఈ పథకాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీచ్ అధికారులు అశోక్, ఆగేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

అర్వపల్లి : ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరుతూ వచ్చే నెల 8న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో జరిగే ప్రజా ధర్నాను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. ఈ మేరకు శనివారం జాజిరెడ్డిగూడెంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మృతి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు ముత్తినేని అనసూర్యమ్మ(84) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తమూల భుజంగరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



తిమ్మాపురం స్టేజీ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : వేసవిలో బాటసారులు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ టి.గోపి కోరారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం బస్‌స్టేజీ వద్ద హైవేపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్ద గ్రామాల్లో గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు దేవులపల్లి నవీన్‌రెడ్డి, రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



ఆత్మకూర్ (ఎస్) : నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

చివ్వెంల : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సువెన్ ఫార్మా సహకారంతో, అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కుడకుడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ధరావతు వీరన్న నాయక్, మాజీ కౌన్సిలర్ వేములకొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడి నరసమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు కృష్ణ విద్యార్థులకు శనివారం నోటు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ జర్నలిస్టు అవార్డు గ్రహీత భూపతి రాములు, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ జలగం మల్లేష్, కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అర్వపల్లి : వేసవిలో ఎండలు తీవ్రమైనందున ఉపాధిహామీ కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకోవాలని ఎంపీడీఓ టి.గోపి కోరారు. మండలంలోని బొల్లంపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను శనివారం పరిశీలించారు. వడదెబ్బకు గురికాకుండా కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పి. చంద్రు, గ్రామపంచాయతీ సిబ్బంది ఖమ్మంపాటి రవీందర్ పాల్గొన్నారు.